


మయిన గాలియమ్ ఆర్సెనైడ్ ఏకస్ఫటికం తయారీకి సంబంధించిన ప్రయోగాలను మీర్ కేంద్రంలోని శాస్త్రజ్ఞులు మే రెండో తేదీనాడు జయప్రదంగా పూర్తిచేశారు.

మీర్ కేంద్రంలో పరిశోధనా కార్యక్రమాలు ముందు అనుకున్న దాని ప్రకారం సజావుగా సాగుతున్నాయి. సోవియట్ కాస్మనాట్లు అనతోలియమ్ సలవ్యోవ్, అలెక్సాండ్ర్ బలందీన్‌లు ఆరోగ్యంగా ఉన్నారు. ●




# నైతికపతనం నాగరికతా?

## కొల్లిమర్ల సాంబశివరావు

**సూర్యుడి కన్నా హోటల్స్‌కి చలాకీ ఎక్కువ కాబోలు. సూర్యుడు నిద్రలేచి, షోకులు చేసి బయలుదేరేటప్పటికే ముందుగా హోటల్స్ అలంకరించుకుని తమ కస్టమర్స్ కోసం ఎదురు చూస్తుంటాయి.**

నవయుగ హోటల్ ఆ రోజే రిలీజయిన కొత్త సినిమాహాలులా వుంది. నేనూ శంకర్ అక్కడ కూర్చుని పది నిమిషాలు పైనే అయ్యింది. ఆర్డరిచ్చిన 'టీ' ఇంకా రాలేదు. మేము కూర్చున్నది డైనింగ్ హాల్ కమ్ స్పెషల్ రూమ్. మధ్యాహ్న భోజనాల సమయం కావటంతో భోజనం చేసే కస్టమర్స్ ఎక్కువ వున్నారు. వున్న నలుగురు సప్లయర్స్ బిజీగా సప్లయి చేస్తున్నారు. భోంచేసే వాళ్ళు కామ్‌గా, ఆతృతగా భోంచేస్తున్నారు. టిఫిన్‌లు చేసేవాళ్ళు మాత్రం కబుర్లు చెప్పుకుంటున్నారు. కొందరు తింటూ, కొందరు తిన్న తర్వాత గంటల తరబడి కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ప్రక్క వున్న జనం సంగతి మరచినట్లుగా- కొంతమంది కాలేజీ కబుర్లు, కొంతమంది ఆఫీసుల కబుర్లు, కొంతమంది రాజకీయాలు, వివిధ మంది వివిధ రకాలుగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

'టీ' తెచ్చి మా ముందు పెట్టి వెళ్ళే సప్లయర్‌ని శంకర్ 'హుష్' అంటూ పిలిచాడు. ఆ సప్లయర్ మాకేసి తిరిగి కోపంగా చూసాడు. 'హుష్' అన్నందుకు కోపం వచ్చి వుంటుంది.

"అగ్గిపెట్టి ఇవ్వు కొంచెం" అడిగాడు శంకర్.

"లేదు" సీరియస్‌గా అనేసి వెళ్ళిపోయాడు ఆ సప్లయర్.

"చూడరా! ఎంత పొగరో వాడికి" అన్నాడు శంకర్.

"నువ్వు అలా 'హుష్' అని పిలవడం ఎందుకురా? సప్లయర్ అనో, మిస్టర్ అనో పిలవవచ్చు కదా!" అన్నాను.

"నువ్వు మరీ విచిత్రంగా మాట్లాడతావురా! నేనొక్కడ్నే అలా పిలిచానా? ఎంతో మంది అలాగే పిలుస్తారు తెలుసా?"

నిజమే! ఎంతో మంది చదువుకున్న వాళ్ళు కూడా అలాగే పిలుస్తుంటారు. వాళ్ళకు సప్లయర్ అంటే చాలా మామూలుగా, చిన్న తరగతివాడుగా అనిపిస్తుంది. వాళ్ళ చదువు, సుపీరియారిటీ కాంప్లెక్స్, పొజిషను వాళ్ళ చేత అలా అనిపిస్తుంది.

శంకర్‌తో ఈ మాటలు చెపితే వాడు నవ్వుతూ, "నువ్వు మరీ సెన్సిటివ్‌రా! చిన్న చిన్న విషయాలను కూడా ఏదో ఆలోచిస్తావు. సరే కాని ఈ సిగరెట్ అంటించుకొని వస్తానుండు" అంటూ లేచి వెళ్ళి, సిగరెట్ అంటించుకొని వచ్చాడు. నేను సిగరెట్ అంటించుకున్నాను.

మేము అగ్గిపెట్టి అడిగిన సప్లయర్ ఇంకొక సప్లయర్‌తో "ప్రపంచంలోని భిక్షగాళ్ళలో సగం మంది మన ఇండియాలోనే ఉన్నారటరా! నిజమే అది. ఏభై పైసల సిగరెట్ త్రాగుతారు. దాన్ని అంటించుకొనే అగ్గిపుల్లని అడుక్కుంటారు" అన్నాడు.

అతడి ముఖంలోకి చూసాను ఆశ్చర్యంగా. చదువుకున్న వాడిలా వున్నాడు. శంకర్ ముఖం ఎర్రబడింది



సప్పయర్ అన్న మాటలు వినగానే. కోపంగా ఏదో అనబోయాడు. నేనే వారించాను. ఆ సప్పయర్ అన్న మాటలతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ఎందుకంటే అతడన్నది అక్షరాల నిజం!

శంకర్ మూడ్ మార్చాలని "అంతకూ ఏదో ముఖ్యమైన విషయం చెప్పాలన్నావు. ఏమిటో ఇంకా చెప్పలేదు. ఏమిటి అది?" అని అడిగాను.

ఒక ఆనందవీచిక తళుక్కుమని మెరిసింది శంకర్ ముఖంలో. అంటే- ఏదో ఇంట్రస్టింగ్ విషయమే అయి వుంటుంది అది. శంకర్ చెప్పనారంభించాడు. అది చెప్పేటప్పుడు వాడి కళ్లలో గర్వం, ఆనందం కొట్టొచ్చినట్టుగా కనబడుతున్నాయి.

"మొన్న మా అక్కయ్య వాళ్లతో శివాలయానికి వెళ్లాను. అక్కడ ఒక 'ఫిగర్' కనిపించింది. చాలా బాగుంది. నేను చూసి నవ్వాను. సిగ్గుగా తలొంచుకొని వెళ్లిపోయింది. నిన్న వెళ్లాను. చూసి నవ్వాను. నా నవ్వుకు బదులుగా తనూ నవ్వింది. వాళ్ల ఇల్లు ఆ గుడి ప్రాంగణంలోనే వున్నట్టుంది. ఇవాళ ప్రొద్దున్నే నేను వస్తానని వూహించి వుంటుంది. నిన్నటి వేళకు బయట నుంచుంది. అంటే పిట్ట లైన్‌లో పడుతున్నది. లైన్‌లో పడగానే నీకు పార్టీ ఇస్తాను" అని పూర్తి చేసాడు శంకర్.

నా మనస్సులో ఏదో సందిగ్ధత. ఏవో తెలియని వ్యథా వీచికలు కదలాడాయి. ప్రేమించుకోవటం తప్పని కాదు. కాని "పిట్ట", "ఫిగర్", "లైన్‌లో పడుతున్నది." అని శంకర్ చౌకబారు పదజాలం వుపయోగించటమే నా బాధకు కారణం. నేను మౌనంగా వుండటంతో శంకర్, "ఏంరా! మాట్లాడవూ?, రేపు నాతో వచ్చి చూడు ఎలా వుందో ఆ అమ్మాయి. ఏం వస్తావా?" అన్నాడు.

"పుణ్యం చాలా మూట కట్టుకుంటున్నావన్న మాట రోజూ గుడికి వెళుతూ" నవ్వుతూ అన్నాను.

★ ★ ★ ★ ★

"మరునాడు శంకర్‌తో గుడికి వెళ్లాలని నాకు ఇష్టంలేదు... కాని వెళ్లక

తప్పలేదు. శంకర్ మా ఇంటికి వచ్చి మరీ నన్ను లాక్కెళ్లాడు. నా మనస్సులో ఏదో ఇబ్బందికరమైన ఫీలింగ్! ఒక అమ్మాయిని చూడటానికి గుడికి వెళ్లవలసిన అవసరం ఏర్పడటం వలన. నేను మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడే గుడికి వెళతాను. ఏదో మొక్కుబడిగా గుడికి వెళ్లి నమస్కారం పెట్టి రావటం నాకు ఇష్టంలేదు. మరి శంకర్‌తో నేను రాలేను అని ఖచ్చితంగా చెప్పవచ్చు కదా!ఉహూ! అలా చెప్పలేదు. అంటే- నా మనస్సులో ఏదో మూల ఆ అమ్మాయిని చూడాలన్న కోరిక ఉన్నదన్నమాట.

దైవదర్శనం ముగించుకొని మండపం మీద కూర్చున్నాము. అక్కడకు సుమారు ముప్పై మీటర్ల దూరంలో వుందో ఇల్లు. "అదే వాళ్ల ఇల్లు" శంకర్ చెప్పాడు. వాడి ముఖంలో ఆతృత తొంగి చూస్తోంది.

ఇంతలో ఆ ఇంటిలో నుంచి నీళ్ల బిందెతో బయటకు వచ్చింది ఓ యువతి. ఆమెను చూడగానే శంకర్ కళ్లు మెరిశాయి. ఆ అమ్మాయే అనుకున్నాను. చాలా అందంగా వుందా యువతి. అప్పుడే తలంటు స్నానం చేసింది కాబోలు విరబోసుకున్న శిరోజాలతో వికసించిన కమలంలా వుంది. నడుము మీద ఆ బిందె.... నాకు పదహారణాల తెలిగింటి ఆడబడుచు గుర్తుకు వచ్చింది. శంకర్‌ని చూడగానే చిరునవ్వుతో విచ్చుకొన్నాయి ఆమె పెదవులు ఒక్క క్షణం! అంతలోనే ప్రక్కనున్న నన్ను చూసి సిగ్గుగా తలదించుకొని పంపు దగ్గరకు వెళ్లింది. ఆ ముగ్ధత్వమూ, ఆమె అందమైన సిగ్గు ముచ్చటగా వుంది-ఏమైనా! శంకర్ లక్కీ ఫెలో అనుకొన్నాను.

"ఎలా వుందిరా?" అడిగాడు శంకర్.

"వెరీ ఫైన్" అన్నాను.

★ ★ ★ ★ ★

ఆరోజు రాత్రి మామయ్య వూరునుంచి వచ్చాడు. శెలవులే కదరా! మా వూరికి రా, పది రోజులుండి పోదువు గాని" అని ఆహ్వానించాడు. ఆ మరుసటిరోజే మామయ్యతో కల్సి వాళ్ళ వూరు వెళ్ళాను.

మామయ్య నాకు ఒట్టి మేనమామే కాదు. కాళ్ళు కడిగి కన్యాదానం

## నైతికపతనం-నాగరికతా?

చేయబోయే మామగారు కూడా!

మామయ్యకు నలుగురు కూతుళ్ళు. అందులో రెండవ అమ్మాయి 'సత్య' నా వుడ్‌బీ. సత్య అంటే చిన్నప్పట్నించీ నా కిష్టం. సత్యమీద నాకు ఇష్టం పెరగ టానికి చిన్నతనంలో జరిగిన ఒక సంఘటన కారణం.

నేను ఆరవ తరగతి చేరిన నెల రోజులకు నాన్నగార్కి ట్రాన్స్‌ఫర్ అయ్యింది. చేరిన నెల రోజులకే టి. సి. ఇవ్వం. క్వార్టర్లీ ఎగ్జామ్స్ అయిన తరువాత ఇస్తా మన్నారు స్కూల్‌వాళ్ళు. అమ్మా, నాన్న వాళ్ళు నన్ను మామయ్య వాళ్ళ ఇంట్లో విడిచి వెళ్ళిపోయారు.

ఒకరోజు పని మనిషి "ఏమ్మా అల్లుడిని ఇంట్లో పెట్టుకున్నారు. ఏ అమ్మాయినిచ్చి పెళ్ళి చేస్తారు?" అని అడిగింది.

మా సత్యనిచ్చి చేస్తాము. పేర్లు కూడా బాగా కలిసినవి. సత్య-కృష్ణ అని. మా వదినకు కూడా సత్య అంటే ఇష్టం" అంటూ మా అత్తయ్య నా వైపు చూస్తూ "ఏరా! మా సత్యని చేసుకుంటావా?" అని అడిగింది అత్తయ్య. అప్పుడే "సత్య నా భార్య" అన్న భావన ముద్రపడిపోయింది. నా మనస్సులో ఆ భావనను అలా పెంచుకుంటూ వచ్చాను.

కాలేజీలో చేరిన కొత్తలో అమ్మ ఒకసారి "కృష్ణా! కాలేజీలో ఎవరినైనా ప్రేమిస్తావేమో! అదేం కుదరదు. మామయ్యకు మాట ఇచ్చాను. సత్యను నీకు చేసుకుంటానని. సత్యనే ప్రేమించు. తెల్సిందా!" అన్నది.

"రోగి పాలు త్రాగాలనుకుంటే డాక్టర్ పాలే త్రాగమన్నాడట." ఆ సామెత గుర్తుకు వచ్చింది నాకు అపుడు. అప్పటినుండి సత్యను యధేచ్ఛగా ప్రేమిస్తున్నాను.

నేను సత్యను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. సత్య నన్ను అంతగా ప్రేమిస్తుందా? అన్న అనుమానం వుండేది ఒకప్పుడు. అది ఒక సంఘటనతో తీరిపోయింది.







## అమితాబ్ పై 'అమృతా'భిమానం

అమితాబ్ బచ్చన్ పైన అమృతాసింగ్‌కు ఎనలేని అభిమానమట. అమితాబ్‌ను మానవత్వానికి ప్రతిరూపంగా భావిస్తుం దిట అమృతాసింగ్. ఎప్పుడైనా తాను స్వంతంగా సినిమా తీయాలని అమితాబ్ నిర్ణయించుకుని ఆ చిత్రంలో తనకు ఎటువంటి అవకాశం యివ్వకపోతే యిక తాను సినిమా రంగంనుంచి విరమించు కుంటుందట. అమితాబ్ మీద ఆ అభి మానమేమిటో?

దాదాపు రెండు సంవత్సరాల క్రితం-

అపుడు సత్యవాళ్ళూ, మేము ఒక వూళ్ళోనే వుండేవాళ్ళం. ఆ రోజు సత్య పుట్టిన రోజు. ప్రొద్దున్నే వాళ్ళ ఇంటికి వెళ్ళి సత్యకి గ్రీటింగ్స్ చెప్పి, అత్తయ్య పెట్టిన స్వీట్ తిని సాయంత్రము సినిమాకు వెళదామని చెప్పి వచ్చేశాను.

సాయంత్రం నేను వెళ్ళేసరికి అంతా రెడీగా వున్నారు. క్రొత్త బట్టలతో సత్య మెరిసిపోతోంది. కాని ముఖంలో ఎందుకో నీరసం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. దార్లో అడిగాను.

"ఏం రా! అలా వున్నావు" ప్రక్క నుంచి మా మరదలు "బావా! ప్రొద్దున్నుంచి అక్క ఏం తినలేదు. కడుపునొప్పిట!" అంది.

"కడుపు నొప్పా! టాబ్లెట్ ఏమీ తీసుకోలేదా? ఇపుడు వుందా? టాబ్లెట్ తీసుకురానా?" ఆత్రంగా అడిగాను.

"ఇపుడేం లేదు!" సీరియస్‌గా అంది సత్య.

ఎందుకో సత్య ఈ రోజు ఏదోలా వుంది. ఎందుకు? ఎందుకని? నాకేమీ అర్థం కాలేదు.

థియేటర్‌కు చేరుకున్నాము. సత్యవాళ్ళ అక్కయ్య టికెట్స్ తీసుకు రావటానికి వెళ్ళింది. చిన్న మరదళ్ళు ఇద్దరూ ఎవరో క్లాస్‌మేట్స్ కలిశారు కాబోలు! వారితో మాట్లాడుకుంటున్నారు. నేనూ, సత్య వంటరిగా వున్నాము.

"ఎందుకురా! అలా వున్నావు? ఏమిటో నాకు చెప్పవా?" లాలనగా అడిగాను.

"ఏం లేదు" అంది క్లుప్తంగా.

"ప్లీజ్ సత్యా! ఏమిటో చెప్పకుండా నాకు ఎలా తెలుస్తుంది? ప్లీజ్ చెప్పవూ?" అని అర్థించాను.

"ఇవ్వాళ ఏం రోజు బావా?"

"నీ పుట్టిన రోజు!"

"నీ పుట్టిన రోజున నువ్వు ఏమన్నావో మర్చిపోయావా బావా?" బాధగా అడిగింది సత్య. ఆ కోపంలో ప్రేమాను రాగాలు, ఆ బాధలో మమత స్పష్టంగా గోచరిస్తున్నాయి.

"నా పుట్టిన రోజునా?" అని ఆశ్చర్య పోయి ఆలోచనలో పడ్డాను ఒక క్షణం. ఒక్కొక్కటి గుర్తుకు వస్తున్నాయి.

## నైతికపతనం నాగరికతా?

నా పుట్టిన రోజు మూడు నెలలు అయింది. ఆ రోజు ఎలా గడిచింది? ప్రొద్దున్నే లేచాను. తలంటు స్నానం చేసాను. సత్య వెనుక నుంచి వచ్చి కళ్ళుమూసి నోట్లో ఏదో స్వీటు.

అంతే! నాకర్థమైంది!!

కోపం, సంతోషం, దుఃఖం, బాధ మొదలైన భావాలన్నీ కలగా పులగం అయిపోయి అదోలా అయిపోయాను. ఆ రోజు నా పుట్టిన రోజు సత్య నా నోట్లో స్వీట్ పెట్టి, "నీ పుట్టిన రోజున నీకు నేనే ముందు స్వీట్ పెట్టాను చూడు బావా!" అన్నది.

"అయితే, నీ పుట్టిన రోజున నేనే నీకు ముందు స్వీట్ పెడతాను" అన్నాన్నేను.

ఆ మాట అపుడే మరిచిపోయాను. తను ఇన్ని రోజులు గుర్తుంచుకొని, ఆ రోజు దానికోసం, ముఖ్యంగా పుట్టిన రోజునాడు ఏం తినకుండా వున్నదంటే... మైగాడ్... సత్య ముఖంలోకి చూచాను. పట్టుదల ఆమెకళ్ళల్లో మెరుస్తుంది. ఇంత పట్టుదల, ఈపాటి వ్యక్తిత్వము, నా మీద ఇంత ప్రేమ! ఆమె జీవితం నా కోసమేనేమో! ప్రేమగా లాలించే తల్లిదండ్రుల్ని బాధలో ఓదార్చే మిత్రులను చూచాను. ఇపుడు సత్యను

> **కాశ్మీర్‌లో**
>
> **షూటింగ్‌లు-'నో'**
>
> షూటింగ్ లొకేషన్సుకు సంబంధించి హిందీ చిత్ర పరిశ్రమ తన జాబితాలోంచి కాశ్మీర్‌ను తొలగించిందట. కాశ్మీర్ మీద ఎందుకు వెక్స్ అయిపోయారో మరి! అప్పుడు షూటింగ్‌లకు సిమ్లాగాని, కులు మనాలిని గాని ఎన్నుకుంటున్నారు. సుభాష్‌ఘయ్ తను తీసే సౌదాగర్ చిత్రం తాలూకు షూటింగును, రణధీర్‌కపూర్ హెన్నా చిత్రం షూటింగును నేపాల్‌లో తీస్తున్నారట.
>
> కాశ్మీర్‌నుంచి క్రొత్తదనం వాళ్ళకు యిక్కడ ఏం లభించిందో!

చూస్తున్నాను. ఆమె సత్యకాదు. ప్రేమ, అనురాగం, మమత, మంచితనం, కల్మషంలేని మనస్సుల అపూర్వ అవతారమూర్తి నా దేవత. చాలు సత్యతో నా జీవితం ఆనందంగా గడిచిపోతుంది.

"సత్యా!.. అయామ్ సారీ సత్యా!రియల్లీ అయామ్ వెరీసారీ సత్యా!" తప్పుచేసి,మన్నించకపోయినా మనస్సు కుదుటపర్చుకోవాలని అలా ఆర్ద్రతగా అన్నాను. ఇంక టైమ్ వేస్ట్ చేయలేదు. వెంటనే ఓ చాక్‌లెట్ తెచ్చి సత్యనోట్లో పెట్టాను. సత్య కళ్ళల్లో మెరుపు.

"బావా! ఆకలేస్తున్నది!" గోముగా అడిగింది సత్య.

ఇంతలో సత్య వాళ్ళ అక్క టికెట్స్ తీసుకొని వచ్చింది.

"సత్యకు ఆకలేస్తున్నదట! టిఫిన్‌చేసి వస్తాము. మీరు వస్తారా? లోపల కూర్చుంటారా?" అని అడిగాను.

"మీరు వెళ్ళిరండి బావా!" అంది రెండు టికెట్స్ మాకిచ్చి. మనస్సులో నే కృతజ్ఞతలు చెప్పుకున్నాను ఆమెకు.

సత్యలో నాకు ముఖ్యంగా నచ్చేది ఆమె ప్రవర్తన!

ఎవరన్నా వున్నపుడు ఎంత గంభీ రంగా, మౌనంగా వుంటుందో వంటరిగా వున్నపుడు అంతకు రెట్టింపు చిలిపిగా ప్రవర్తిస్తుంది.

ఆ రోజు ఆ విధంగా మా ఇద్దరి జీవితాల్లో మరపురాని సంఘటనగా మిగిలిపోయింది.

★ ★ ★ ★ ★ ★

పదిహేను రోజులు మామయ్యవాళ్ళ వూర్లో ఆనందంగా గడిపి వచ్చాను. శంకర్ మర్నాడు కనిపించాడు. వాడిని చూడగానే నాకు ఆ అమ్మాయి గుర్తుకువచ్చింది.

"హల్లో! శంకర్! ఎలా వుందిరా నీ ప్రణయం? ఎనీ ఇంప్రూవ్‌మెంట్?" నవ్వుతూ అడిగాను.

"సెంట్ పర్సెంట్ సక్సెస్!" గర్వంగా భుజాలు ఎగరేసి చెప్పాడు శంకర్.

"అంటే? నీతో మాట్లాడిందా ఆ అమ్మాయి?"

"మాట్లాడటమా?" అని గట్టిగానవ్వి. "మాట్లాడట మేమిటిరా! పని కూడ అయిపోయింది!"

"అసలుపనా? ఏం పని??" ఆశ్చర్యంగా అడిగాను.

"ఇంకా అర్థం కాలేదురా? ట్యూబ్‌లైట్! అదేరా! సృష్టికార్యం!"

అంతే! షాక్ కొట్టినట్లయింది నాకు. తరువాత శంకర్ మాటలు వినిపించ లేదు.

"నిజమేనా? నిజంగా అది జరిగిందా?" అన్న అనుమానం వెయ్యి తలలు వేసింది. శంకర్ చెప్పింది నిజమే అయ్యుంటుంది. వాడు నా దగ్గర అబద్ధం చెప్పడు. అపుడు నాకు–

"ఏమిటి? ఆడా, మగా కలవటం ఓ సామాన్య విషయం అయిపోయిందా?? ఆ అమ్మాయి అమాయక ముఖం కళ్ళముందు మెదిలింది. ఎంత అమాయకంగా, ఎంత ముగ్ధంగా ఉంది!? అదంతా నటనేనా? ఎంతో ఎత్తునుంచి క్రింద పడినట్లయింది నాకు.

స్త్రీ అంటే నాకు చాలా గౌరవం! స్త్రీ గురించి నాకు కొన్ని నిర్దిష్ట భావాలున్నాయి. ఒక కవి సినిమా పాటలో స్త్రీ గొప్పతనం గురించి వివరించి చివరలో "సృష్టించెను ఆ దేవుడు తనకు మారుగా!" అని వ్రాశాడు. ఎంత మంచి భావమూ, ఎంత గొప్ప భావమూ ఉన్నాయి ఆ చిన్న వాక్యంలో. ఆ వాక్యాన్ని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను.

"మరి! ఇప్పుడేమిటి? ఇలా?"

ఒక యువకుడితో 15 రోజుల పరిచయంతో ఎలా ఏకం అయ్యింది పెళ్ళికాకుండా?

తల తిరిగిపోతోంది. పెళ్ళి గురించి, స్త్రీ పురుషుల కలయిక గురించి, చిన్నప్పటి నుంచి ఏవేవో పవిత్రమైన సున్నితమైన భావాలు పెంచుకుంటూ వచ్చాను.

నా ఆలోచనల్ను, ఆశ్చర్యాన్ని ఆపి, "ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటావా?" అని అడిగాను.

"వ్వాట్ డుయుమీన్??" కోపంగా అన్నాడు శంకర్.

వాడు ఏ ఉద్దేశ్యంతో అన్నాడో అర్థం కాలేదు: పెళ్ళి చేసుకుంటానన్న భావంతోనా? ఆమెను ఎందుకు చేసుకోవాలన్న భావంతోనా? అనుమానంగా అడిగాను.

"అయితే! ఎపుడు పెళ్ళి? మీ ఇంట్లో ఒప్పుకుంటారా?"

శంకర్ ఆశ్చర్యంగా జాలిగా నా వైపు చూసి,

"ఫూలిష్‌గా మాట్లాడకురా! ఆ అమ్మాయిని నేను చేసుకోవట మేమిటి? నా అంతస్థు ఎక్కడ? ఆమె అంతస్థు ఎక్కడ? అయినా పది రోజుల పరిచయంతో మీద చేయి వేస్తే లొంగిపోయిన ఆ కాముకురాలిని చేసుకోవాలా?"

"చెయ్యి వేస్తే లొంగిపోయిన ఆమె కాముకురాలు, చెయ్యి వేసిన నువ్వు పవిత్రుడివా? శీలవంతుడివా??" వ్యంగ్యంగా, కోపంగా అడిగాను.

"నే నెవర్నీ కాదు, మగాడ్ని!" గర్వంగా అన్నాడు శంకర్.

అపుడు నాకు శంకర్ ముఖంలో సాధు జంతువులను చంపి భక్షించే క్రూర జంతువు కనిపించింది. సీతను చెరపట్టిన లంకేశ్వరుని అవతారం కనిపించింది. ఆడవారిని నమ్మించి, మోసం చేసే మగవాడి అహంకారం కనిపించింది.

నాకు ఒక్కసారి అసహ్యం వేసింది! శంకర్ మీదే కాదు. మొత్తం మగజాతి మీద!

వయస్సు వచ్చిన కూతుర్లను ఇంట్లో పెట్టుకుని రోడ్డు మీద కనపడిన అమ్మాయిల్ని, ఆశగా, కాంక్షగా, ఆకలిగా చూసే కాముకులు!

ఆడపిల్లల్ని ఘోరంగా ఏడిపిస్తూ శాడిస్టిక్ ఆనందాన్ని అనుభవిస్తున్న యువకులు! ఒకసారి అదే స్థానంలో వాళ్ళ చెల్లెల్ని, అక్కల్ని వూహించుకొంటే ఇలా చేయగలరా? చేస్తారేమో! ఇలాగే చేస్తారు. ఇప్పుడు అన్నా చెల్లెళ్ళ పవిత్ర బంధానికే కళంకం తెచ్చే అపర కాముకుల గాథలు తెలుస్తూనే వున్నాయి కదా?!

"ఏమిటి ఇది? ఎందుకిలా జరుగుతోంది?? మన సమాజం ఎటువైపు పయనిస్తోంది? ఇదంతా నాగరికతా?? నాగరికత పెరిగే కొద్దీ, నైతిక విలువలు పూర్తిగా పతనమవుతున్నాయి ఎందుకు?"

"నైతిక పతనం నాగరికతకు చిహ్నమా?"

"ఈ పురుష జాత్యహంకారం ఎపుడు నశిస్తుంది?"

తొమ్మిది నెలలు మోసి, ప్రసవ వేదనను ఆనందంగా అనుభవించి, జన్మనిచ్చి, తన రక్తాన్ని పాలుగా మార్చి ఇచ్చి పెంచే స్త్రీ జాతిని ఎంత ఆదరంగా చూస్తోందీ పురుష జాతి!

ఎంతటి కృతఘ్నులు ఈ పురుషులు!

ఇంక ఆలోచించ లేక మొద్దుబారి పోయింది నా మనస్సు!

●

## ఏక్తా షర్తులు



దేవానంద్ చిత్రం అవ్వల్ నంబర్ ఫేమ్ ఏక్తా తన నిర్మాతలు ఏం చేయాలో, ఏం చేయకూడదో ఒక చేంతాడంత లిస్ట్ రాసిచ్చిందట. అందులో తన రెమ్యూనరేషన్ చిత్ర నిర్మాణపు ఖర్చులో 10% తెల్ల డబ్బు యివ్వాలట. ఇహ నల్ల డబ్బు నిష్పత్తి ఆయా పరిస్థితులనుబట్టి మారుతుంటుందట. ఇలాంటివే ఎన్నో డిమాండ్లు చేసిందట. ఈమెను అసలు మొదట పరిచయం చేసిన సనిల్‌ఖోస్లాయే తన చిత్రంలో ఆమెను అర్ధ నగ్నంగా ఇంచుమించు నగ్నంగా ఎంతవరకు చూపాలో అంతవరకు చూపించాడట. ఇంక చూపవలసింది ఏమీ లేదంటున్నారు. అట్లాంటపుడు ఈమె డిమాండ్లకు ఎంతవరకు విలువ వుంటుందో!